సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



3,957 మందికి కంటిపరీక్షలు

సిరిసిల్లఅర్బన్:జిల్లావ్యాప్తంగా మంగళవారం 3,957 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 628మందికి రీడింగ్ అద్దాలు, 434 మందికి పాయింట్ గ్లాసులు అందించారు.



ఓటమి నేర్పిన గెలుపు..

మూడుసార్లు ప్రయత్నించి సివిల్స్‌లో విజయం సాధించానని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.0/15.0

వాతావరణం

పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఉక్కపోత ఉంటుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగు తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పిల్లల్లో రక్తహీనతపై శ్రద్ధ వహించాలి



సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్లటౌన్: రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పిల్లల్లో రక్తహీనత బారిన పడకుండా వార్డెన్స్ ప్రత్యేకశ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్ రావు సూచించారు. మంగళవారం విద్యాసంస్థల సిబ్బంది, వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. రక్తహీనత ఉన్న పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని, ఆహారంలో పిండి పదార్థాలు, కొవ్వులు, మాంసకృతులు, ఖనిజ లవణాలు, విటమిన్లు ఉండాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై జిల్లా వైద్యశాఖ అన్నివేళలో అందుబాటులో ఉంటుందన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు, డీఐవో డాక్టర్ మహేశ్, డీఈవో రాధాకిషన్, టీటీటి బాలయ్య, డీఈఎంఓ ప్రభలత, పీడీహెచ్ఎన్ఓ లింగం, హెచ్ఈవో జలపతి పాల్గొన్నారు.

బడుగుల రాజ్యాధికారమే లక్ష్యం



మాట్లాడుతున్న వర్దెల్లి స్వామిగౌడ్

సిరిసిల్లటౌన్: బడుగులు రాజ్యాధికారం సాధించినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వర్దెల్లి స్వామిగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. బడుగుల ఉన్నతికోసం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పని చేస్తున్నారన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీవర్గాలు రాజకీయంగా సంఘటితం కావాలని కోరారు. ఈనెల 19న ఎల్లారెడ్డిపేట మండలం బాకూరుపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించడానికి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ వస్తున్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, జిల్లా ఇన్‌చార్జి మ్యాకల మునీందర్, నాయకులు లింగంపల్లి మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలసాగుపై దృష్టి సారించాలి



ఆయిల్‌పాంను పరిశీలిస్తున్న జ్యోతి

వేములవాడరూరల్: రైతులు అంతర పంటలసాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి సూచించారు. వేములవాడ, బోయినపల్లి మండలాల్లో మంగళవారం ఆయిల్‌పాం పంటలను పరిశీలించారు. ప్రభుత్వం ఆయిల్‌పాం పంటలపై సబ్సిడీ అందిస్తోందని అన్నారు. ఇప్పటికే వేములవాడ డివిజన్‌లో 311 ఎకరాల్లో 102 మంది రైతులు పంట సాగు చేస్తున్నారని అన్నారు. ఈ పంటల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. వేములవాడ ఉద్యానవనశాఖ అధికారి గోవర్దన్, ఆయిల్‌పాం అధికారులు సతీశ్, అరవింద్ ఉన్నారు.

'కొండ'ంత ఆశలు..!

నేడు కొండగట్టుకు సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొండగట్టు.. ఉమ్మడి జిల్లాలోనే కాదు.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన చారిత్రక పుణ్యక్షేత్రం. ఉద్యమ సమయం నుంచి సీఎం కేసీఆర్ ఈ ఆలయం అభివృద్ధికి అనేక హామీలిచ్చారు. తాజాగా ఆలయం మాస్టర్‌ప్లాన్ కోసం రూ.100 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా ఆలయం మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు స్వయంగా కొండగట్టుకు వస్తున్నారు. సీఎం వెంట యాదాద్రికి డిజైన్లు అందించిన ఆనంద్‌సాయి కూడా వస్తున్నట్లు సమాచారం. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పుణ్యక్షేత్రానికి రామాయణ కాలం నుంచి ప్రత్యేక చరిత్ర ఉంది. ఇంతటి వారసత్వ సంపదను కాపాడుకునేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్న వేళ.. భక్తులంతా కొండంత ఆశలతో అనేక డిమాండ్లు వినిపిస్తున్నారు. సీఎం పర్యటన సందర్భంగా కొండగట్టుపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..!





పునాదుల్లోనే ఆగిపోయిన మాల విరమణ మండపం పనులు

సీఎం కేసీఆర్ షెడ్యూల్ ఇదీ..

జగిత్యాల:

- సీఎం కేసీఆర్ బుధవారం ఉదయం 9గంటలకు హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ నుంచి బయలు దేరుతారు.
- నేరుగా బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి హెలిక్యాప్టర్‌లో జగిత్యాలకు బయలుదేరుతారు.
- ఉదయం 9.45 గంటలకు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధికి చేరుకుంటారు.
- స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులతో సమావేశం నిర్వహిస్తారు.
- ఆలయ అభివృద్ధికి కేటాయించిన రూ.100 కోట్లు వెచ్చించి చేపట్టే ప్రగతి పనులపై సమీక్షిస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి హైదరాబాద్‌కు హెలిక్యాప్టర్‌లో వెళ్తారు.
- మధ్యాహ్నం 1.40గంటలకు ప్రగతి భవన్ చేరుకుంటారు.



గతంలో నిర్మించిన గదులు



సీతమ్మ కన్నీటి ధారలు



కల్యాణకట్ట దుస్థితి

చారిత్రక ఆస్తి పరిరక్షణ

కొండపై అనేక చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. రామాయణకాలంలో లక్ష్మణుడిని కాపాడేందుకు సంజీవనని హనుమంతుడు ఎత్తుకుపోతున్న క్రమంలో ఆ గుట్ట నుంచి చిన్న ముక్క విరిగిపడిందని, అదే ప్రస్తుత కొండగట్టు అన్నది భక్తుల విశ్వాసం. 300 ఏళ్ల క్రితం ఆవులకాపరి స్వామివారికి చిన్న ఆలయాన్ని నిర్మించగా.. 160 ఏళ్ల కింద క్రిష్టారావు దేశ్‌ముఖ్ ప్రస్తుత ఆలయాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది. ఇక్కడ హనుమంతుడికి ద్వారపాలకుడిగా భేతాళుడు ఉండటం విశేషం. గుట్టపై భేతాళ స్వామి ఆలయం, సీతమ్మ కన్నీటిగుంటలు, మునుల గుహ, జలబుగ్గ, శ్రీరాముల ఆలయం, కొండలరాయుడి కోట, మెట్ల దారి తదితరాలను పరిరక్షించి, అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు కోరుతున్నారు.

- ఇటీవల రూ.100 కోట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి
- మౌలిక సదుపాయాలు, మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష
- ఆసుపత్రి, ఫైర్‌స్టేషన్, పీహెచ్‌సీ కావాలంటున్న భక్తులు
- హరిత హోటళ్లు, ఆన్‌లైన్ బుకింగ్‌లకు డిమాండ్
- రైల్వేస్టేషన్– కొండ మీదకు రవాణా మెరుగవ్వాలని కోరిక
- మానసిక చికిత్సాలయం ఉండాలంటున్న ఆరాధకులు
- 108 అడుగుల భారీ విగ్రహం ప్రతిష్ఠాపన?



ప్రసాదం తయారు చేసే కేంద్రం వెనుక అధ్వానంగా పరిసరాలు

అభివృద్ధి చేయాల్సినవి ఇవే..

- భేతాళ ఆలయం చెత్తాచెదారంతో నిండి పారిశుధ్య సమస్య ఎదుర్కొంటోంది.
- మండువేసవిలోనూ ఎండని సీతమ్మవారి కన్నీటి గుంటలకు ప్రచారం కల్పించాలి.
- కొండగట్టుపై శ్రీరాముని ఆలయం ఉన్న విషయం చాలామందికి తెలియదు.
- వందల ఏళ్ల క్రితం తపస్సు చేసుకున్న 'మునులగుహ'కు కాలిబాట కూడా లేదు.
- కొండగట్టు ఘాట్ ప్రాంతం నుంచి కిందికి వెళ్లే క్రమంలో జలబుగ్గ అనే నీటి ప్రవాహం కనిపించకుండా పోయింది.
- ఒకప్పుడు బల్మూరి వంశానికి చెందిన కొండలరాయుడి కోట, గుట్టకు మరింత ప్రచారం కల్పించాలి.
- గుట్ట మీద 108 అడుగుల భారీ ఆంజనేయుడి విగ్రహం ఏర్పాటును సీఎం ప్రకటిస్తారని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మాస్టర్‌ప్లాన్‌లో వీటిని చేర్చాలి

- ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు. సమీపంలోని రైల్వేస్టేషన్‌తో కనెక్టివిటీ కల్పించాలి. భక్తుల వాహనాలకు పార్కింగ్ సమస్య తీర్చాలి.
- కొండగట్టులో మానసిక వ్యాధులు నయమవుతాయని నమ్మకం. అందుకే ఇక్కడ మానసిక చికిత్సాలయం ఏర్పాటు చేయాలి.
- కొండగట్టు పుణ్యక్షేత్రం దర్శనం, గదులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించాలి. ఏటీఎం, నెట్‌వర్క్ టవర్లను ఏర్పాటు చేయాలి. భక్తులకు తాగునీటి కొరత తీర్చాలి. హరితతోపాటు ప్రైవేటు హోటళ్ల ఏర్పాటు చేసి ఆతిథ్యరంగాన్ని ప్రోత్సహించాలి.
- కొండగట్టుపై జరిగే అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌స్టేషన్, శాంతి భద్రతల నియంత్రణకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు అవసరం.
- స్థానికంగా ఆసుపత్రి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి. 2018లో ఇక్కడ ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైనపుడు ఆసుపత్రి లేని లోటు స్పష్టంగా కనిపించింది.
- లక్షలాది మంది హనుమాన్ దీక్షాపరుల మాల విరమణకు ప్రత్యేక మండపం కావాలి.
- తలనీలాలు సమర్పించే కల్యాణకట్టపై గద్దెలు, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- కొండపై నిత్యం 100 మందికి, మంగళ, శనివారాల్లో 200 మంది భక్తులకు భోజనం పెడుతున్నారు. ఈ సామర్థ్యాన్ని 1000 మందికి పెంచాలి.
- మెట్లదారి, కోనేరు, డ్రైనేజీలు అధ్వానంగా మారాయి. వెంటనే మరమ్మతులు చేయాలి.

భక్తుల సమస్యలు తీర్చండి



కొండగట్టు ఆలయానికి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రూ.100 కోట్లు ఇవ్వడం గొప్ప విషయం. పార్కింగ్, గదులు, తాగునీరు సమస్యలను తీర్చి, ఆలయ పరిసరాలను మరింత అభివృద్ధి చేయాలి.

– ఆరోహి, భక్తురాలు హైదరాబాద్

అభివృద్ధి కోసమే నిధులు

కొండగట్టు ఆలయానికి రూ.100 కోట్లతో మాస్టర్‌ప్లాన్ రూపొందించడం సంతోషం. ఇక ఆలయ అభివృద్ధి వేగం అందుకుంటుంది. పరిసరాలు మెరుగుపడి, స్థానికంగా మరింత మందికి ఉపాధి అవకాశాలు అందివస్తాయి.

– బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచ్ ముత్యంపేట

చరిత్రాత్మక నిర్ణయం



రూ.100 కోట్లతో కొండగట్టుకు మాస్టర్ ప్లాన్ రూపకల్పన చరిత్రాత్మక నిర్ణయం. ఈ నిర్ణయంతో ఆలయ చరిత్రలో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారు. పుణ్యక్షేత్రానికి జాతీయస్థాయిలో ప్రచారం కల్పించడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం, పర్యాటకంగా మరో యాదాద్రిలా మార్చాలన్న పట్టుదలతో సీఎం మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు.

– సుంకె రవి శంకర్, ఎమ్మెల్యే చొప్పదండి

బోనం మొక్కులు.. తీరిన తిప్పలు



వేములవాడ: ఎండొచ్చినా... వానొచ్చినా నెత్తిన అమ్మవారి బోనంతో అవస్థలు పడిన భక్తులకు ఇకనుంచి ఆ తిప్పలు తప్పనున్నాయి. బద్దిపోచమ్మ గుడి విస్తరణలో భాగంగా అక్కడి 38 ఇళ్లను ప్రభుత్వం సేకరించింది. ఇందుకు రూ.20 కోట్ల పరిహారం అందజేసింది. దీంతో బద్దిపోచమ్మ ఆలయానికి 39 గుంటల స్థలం వచ్చి చేరింది. గృహాలను కూలగొట్టిన అధికార యంత్రాంగం ఖాళీ స్థలాన్ని చదును చేసి చలువ పందిళ్లు, క్యూలైన్లు సిద్ధం చేశారు. దీంతో మంగళవారం నుంచి బోనం మొక్కులు చెల్లించే భక్తులు చలవ పందిళ్లకింద క్యూలైన్‌లో నిల్చుని అమ్మవారిని దర్శించుకున్నారు. చలవ పందిళ్లు వేయడంతో పాటు ప్రత్యేక స్థలం ఉండటంతో ప్రశాంతంగా బోనం మొక్కులు చెల్లించుకున్నామని భక్తులు సంతోషం వ్యక్తం చేశారు.

జాతర పనులు త్వరగా పూర్తి చేయండి



వేములవాడ: మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్‌లతో కలసి మంగళవారం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని తిరిగి ఇంటికి సురక్షితంగా చేరుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రధానంగా పార్కింగ్, బస్టాండు ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని ఎస్పీని ఆదేశించారు. ఉత్సవాలను వైభవంగా జరిపించాలని ఈవో కృష్ణప్రసాద్‌కు సూచించారు. ఆయన వెంట డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ వెంకటేశ్, ఆలయ ఈఈ రాజేశ్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



సిరిసిల్లటౌన్: ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలందరికీ అవగాహన అవసరమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. ఈనెల 13నుంచి 17వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగో మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు, డిజిటల్ బ్యాంకింగ్‌తో వినియోగదారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆర్‌బీఐ గుర్తింపు ఉన్న సంస్థలలోనే అప్పులు తీసుకోవాలని సూచించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి మానేరు నదివరకు 2కే వాకింగ్‌ను ఆయన ప్రారంభించగా..వందలాది సంఖ్యలో పౌరులు పాల్గొని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం టీ.ఎన్.మల్లికార్జున్‌రావు, లీడ్‌బ్యాంకు కోఆర్డినేటర్ డి.ప్రేమ్‌కుమార్, వివిధ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



లారీ కింద ఇరుక్కున్న అక్షయ్‌కుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం కామారెడ్డి– సిరిసిల్ల ప్రధాన రహదారి హెచ్‌పీ పెట్రోల్ పంపు ఎదుట లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్న దీవిటి పోశెట్టి, యాడ అక్షయ్‌కుమార్‌లను లారీ ఢీకొనడంతో లారీ టైర్ల కింద పడ్డారు. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్షయ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులు కామారెడ్డి జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిసింది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడ్డ ట్రాక్టర్

చందుర్తి(వేములవాడ): కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు కోనరావుపేట ఎస్సై రమాకాంత్ తెలిపారు. మూలవాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న సమాచారంతో వెళ్లగా ట్రాక్టర్ పట్టుబడిందన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యాజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన భారతి

చందుర్తి(వేములవాడ): కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన వివాహిత మహిళ అల్లపు భారతి కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో తరచూ గొడవలతో మనస్తాపానికి చెందిన అల్లపు భారతి మంగళవారం బోయినపల్లి మండలం కొదురుపాక మిడ్ మానేరు వద్దకు వెళ్లి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భారతి భర్త బాబు ఇటీవలే గల్ఫ్ నుంచి ఇంటికి తిరిగి వచ్చాడు.

ఓటమి నేర్పిన గెలుపు..

- కిరాణం నుంచి ఐపీఎస్ వరకు
- లక్ష్యం వైపుగా అడుగులు పడితే విజయం
- జిల్లాలో భూ సమస్యలు అధికం
- లా అండ్ ఆర్డర్‌కు ప్రథమ ప్రాధాన్యం
- 'సాక్షి'తో ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: 'ప్రభుత్వ ఉన్నత ఉద్యోగం సాధించామంటే ఆర్థికంగా ఉన్న కుటుంబం నుంచే వచ్చారనుకుంటారు అంతా. సివిల్స్‌లో ర్యాంకు కొట్టామంటే కార్పొరేట్ చదువులు చదివారని భావిస్తారు అందరూ. కానీ ఇలాంటి వసతులు లక్ష్యాన్ని దగ్గర చేయగలవేమో కానీ.. పూర్తి విజయతీరాలకు చేర్చలేవు. కిరాణషాపు నిర్వహించే తండ్రికి చేదోడుగా ఉంటూనే సివిల్స్‌లో ర్యాంక్ సాధించాను. ఒకటి, రెండుసార్లు కాదు.. మూడుసార్లు ప్రయత్నించి విజయం సాధించాను' అని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ వివరించారు. జిల్లాలో శాంతిభద్రతలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తానని, అక్రమార్కులపై పీడీయాక్టు పెడతానని మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ఈ సందర్భంగా అఖిల్ మహాజన్ లైఫ్‌జర్నీ గురించి ఆయన మాటల్లోనే...

సాధారణ కుటుంబం నుంచి

మాది జమ్ము. నాన్న రాకేశ్‌కుమార్ గుప్తా, అమ్మ ఊర్మిల్ మహాజన్. నాన్న హోల్‌సేల్ కిరాణం నడిపితే ఆయనతో నేనూ పనిచేసేవాడిని. సివిల్స్‌కు ముందు సాఫ్ట్‌వేర్ జాబ్ చేశాను. ఆ సమయంలోనే ఓ స్నేహితుడితో సివిల్స్ గురించి తెలుసుకున్నా. ప్రజాసేవ చేయవచ్చని గమనించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి సివిల్స్‌పై దృష్టిపెట్టా. కోచింగ్ కోసం నెలరోజులు వెళ్లాను. అక్కడ బోధన తీరు, ఇచ్చే సమాచారం నాకు ఉపయోగకరం అనిపించలేదు. ఇక సొంతంగా చదవాలని నిర్ణయించి, సివిల్స్‌లో అడిగే ప్రశ్నలు దానికి సంబంధించి పుస్తకాలతో నోట్స్ చేశాను. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడుసార్లు సివిల్స్ రాసినా.. అలిసిపోలేదు, ప్రయత్నం ఆపలేదు. అనుకున్న తీరానికి చేరే క్రమంలో 2014 నుంచి 2017 వరకు ప్రయత్నించి చివరకు ఆలిండియా 213 ర్యాంకు సాధించా. ఫెయిల్యూర్ నుంచి సక్సెస్‌ను అందుకున్న రోజు ఆనందం మాటల్లో చెప్పలేనిది.

విద్యాభ్యాసం.. ఉద్యోగం

సొంతూరులోనే పాఠశాల విద్యను పూర్తిచేశా. ఇంజినీరింగ్ హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ క్యాంపస్‌లో చదివాను. 2011లో బీటెక్ పూర్తి చేశాను. ఈసీఈ పూర్తి చేయగానే మైక్రోసాఫ్ట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. కొద్దిరోజులు అందులో పనిచేసి మరో కంపెనీలో చేరాను. ఓ రోజు ఢిల్లీ వెళ్లాను. అక్కడ ఓ స్నేహితుడు సివిల్స్ గురించి సమాచారం ఇవ్వడంతో సివిల్స్ రాయాలని నిర్ణయించుకుని అక్కడే నెలరోజులు కోచింగ్ తీసుకున్నా. నచ్చకపోవడంతో సొంతంగా నోట్స్ రాసుకుని, నాన్నకు వ్యాపారంలో సాయంగా ఉంటూనే చదువు కొనసాగించా. ఆన్‌లైన్ సమాచారంతోపాటు సందేహాల నివృత్తికి సబ్జెక్టులో నిష్ణాతులైన వారి తరగతులు విన్నా. సివిల్స్‌లో సక్సెస్ అయినవారి స్టోరీలు నాలో ధైర్యాన్ని నింపాయి. సివిల్స్ ఆలిండియా ర్యాంకు 213 సాధించిన నన్ను తెలంగాణ క్యాడర్‌కు కేటాయించారు. ఇంజినీరింగ్ చేసిన ప్రాంతం కావడంతో ఆనందంగా ఫీలయ్యాను. ప్రొహిబిషన్ పీరియడ్‌ను సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి పోలీసు స్టేషన్‌లో, తర్వాత మంచిర్యాల ఏసీపీగా, పెద్దపల్లి డీసీపీగా పనిచేశా. ఉద్యోగంలో స్థిరపడిన తరువాత డాక్టర్ దివ్యాన్షీతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెద్దల సమ్మతితో వివాహం జరిగింది. ఎస్పీగా మాత్రం సిరిసిల్లలోనే ప్రథమం. జిల్లా పోలీసు బాస్‌గా ప్రజలతో మమేకం అవుతూ అందరికీ రక్షణ కల్పించే విధంగా ముందుకు సాగుతా.

మూడు అంశాలపై శ్రద్ధ

నేను మూడు అంశాలపై శ్రద్ధ వహిస్తాను. క్రమశిక్షణ, లాఅండ్‌ఆర్డర్, క్రైం ఇన్వెస్టిగేషన్, మహిళల రక్షణ నా ప్రధాన కర్తవ్యం. జిల్లాలో పక్షంరోజులుగా దాదాపు అన్ని స్టేషన్లు సందర్శించాను. ఇక్కడ భూ సమస్యలు అధికంగా ఉన్నట్లు తెలిసింది. గంజాయి క్రయవిక్రయాలు, సేవించడం వల్ల జరిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం. పెద్దపల్లి, మంచిర్యాలతో పోల్చితే ఇక్కడే ప్రశాంత వాతావరణం ఉంది. సిరిసిల్ల, వేములవాడలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ల ఏర్పాటుకు అనుమతి వచ్చింది. వేములవాడలో మహాశివరాత్రి ఉత్సవాల బందోబస్తు ఇప్పుడు నా ముందున్న టాస్క్. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దాదాపు 2000 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నాం.

రాజన్న సేవలో శివ దీక్షాపరులు

- ఏటా పెరుగుతున్న శివ దీక్షలు
- శివనామస్మరణతో మార్మోగుతున్న ఆలయం



రాజన్న ఆలయంలో శివదీక్షను స్వీకరిస్తున్న స్వాములు

వేములవాడఅర్బన్: తెలంగాణలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో ఏటా శివ దీక్షాపరుల సంఖ్య పెరుగుతోంది. దీంతో మహాశివరాత్రి వచ్చిందంటే శివ నామస్మరణతో ఆలయం మార్మోగుతోంది. 1992లో 11 మంది మాలధారణతో ప్రారంభమైన దీక్షలు ప్రస్తుతం 1,200 మంది వరకు చేరారు. వీరంతా రోజూ ఉదయం 4 గంటలకు సుప్రభాత దర్శనం చేసుకుంటూ రాజన్న సేవలో తరిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బోలా శంకరున్ని కొలుస్తూ..

అయ్యప్ప, అంజన్న, కనకదుర్గమ్మ దీక్షలతో పాటు శివస్వామి దీక్షలు కూడా అధికంగా వేస్తున్నారు. శివ దీక్షల్లో యువకులు ఎక్కువగా ఉంటున్నారు. ఈఏడాది జనవరి 6న మండల దీక్ష 41 రోజులు, జనవరి 26న అర్ధమండల దీక్ష 21 రోజులు స్వీకరించారు. అలాగే 11 రోజుల దీక్షను కూడా అనేక మంది స్వీకరించారు. మహాశివరాత్రి వస్తుండటంతో భక్తిశ్రద్ధలతో కోరిన మొక్కులు తీర్చే బోలా శంకరున్ని కొలుస్తున్నారు. అంతేకాకుండా భక్తులు ఎవరైన ఇంట్లో గాని, ట్రస్ట్ భవనంలో మహాలింగార్చన, రుద్రాభిషేకం, సహస్త్ర లింగార్చన చేసుకుంటే శివదీక్ష స్వాములు చేస్తారు.

శివదీక్ష సేవాట్రస్ట్‌లో ఉచిత భోజనం

భగవంతరావునగర్‌లోని పార్వతి రాజరాజేశ్వర శివదీక్ష సేవా ట్రస్ట్‌లో దీక్షాపరులందరికీ ప్రతిరోజూ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఉచిత భోజనం, సాయంత్రం 5 గంటలకు అల్పాహారం అందిస్తున్నారు. నిత్యం 400 నుంచి 600 వరకు భోజనం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు.

ఏటా పెరుగుతున్న శివ భక్తులు

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలతో పాటు సిద్దిపేట, జనగామ జిల్లాల్లో అనేక మంది శివ దీక్షలు స్వీకరించారు. వీరంతా మహాశివరాత్రి రోజున వేములవాడకు చేరుకొని రాజన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఈయేడు మరింత పెరిగే అవకాశం ఉందని శివదీక్షాపరులు అంటున్నారు.

మహాశివరాత్రిన దీక్ష విరమణ

శివ దీక్షాపరులు మహాశివరాత్రి రోజున వేములవాడలో దీక్ష విరమణ చేస్తారు. వీరికి ప్రత్యేకంగా లింగోద్భవనం తర్వాత సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఆలయంలో ప్రత్యేక దర్శనం ఉంటుంది. అనంతరం 6 గంటల నుంచి దీక్ష విరమణ చేస్తారు.

రాజన్న సంకల్పంతో..



రాజన్న సంకల్పంతో 23వ సారి శివ దీక్ష తీసుకున్న. అనుకున్న పనులు నెరవేరుతున్నాయి. ఏటా దీక్ష స్వీకరిస్తూ స్వామి అనుగ్రహంతో ముందుకు వెళ్తున్నా.

– మచ్చ కిషన్, గురుస్వామి, వేములవాడ

అనుకున్నది నెరవేరింది



శివ దీక్షకు ముందు ఆర్థికంగా ఇబ్బందులుండేవి. మహాశివరాత్రి వస్తున్నందున రాజన్నకు సేవ చేయాలని 41 రోజుల దీక్ష తీసుకున్న. ఇప్పటికీ 18 సార్లు స్వీకరించా. దీక్ష తీసుకున్నప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులు తొలగి సంతోషంగా ఉన్నా.

– సామవీర రమణయ్య, గురుస్వామి, వేములవాడ

తండ్రితో పాటు..



మా నాన్న 18 సార్లు శివ దీక్ష తీసుకున్నారు. ఈయేడు నాన్నతో పాటు నేను కూడా శివ దీక్ష తీసుకున్న. రోజూ స్వామి వారి దర్శనం, పూజలకు వస్తున్న. అలాగే పాఠశాలకు వెళ్తూ చదువుకుంటున్న.

– బురుగు అక్షయ్‌కుమార్, విద్యార్థి, వేములవాడ

రాజన్న మీద భక్తితో..



రాజన్న స్వామి మీద భక్తితో మా నాన్నతో పాటు నేను కూడ శివదీక్ష తీసుకున్న. స్వామి వారికి ఇంట్లోనే పూజలు చేసుకుంటాను. అలాగే పాఠశాలకు కూడా వెళ్లి వస్తున్న. సంతోషంగా ఉంది.

– పి. సంఘ్వీ, విద్యార్థిని, వేములవాడ

ఉన్నత లక్ష్యంతో చదవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్పీ

సిరిసిల్లటౌన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టాలెంట్ టెస్ట్ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. పదో తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణతకై టాలెంట్ టెస్టు నిర్వహించడాన్ని అభినందించారు. అంబేడ్కర్ చిత్రపటాన్ని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఎస్పీకి అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్, నాయకులు నర్సింహులు, ఆదిత్య, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలకు నిప్పు



దహనమవుతున్న మొక్కలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని పద్మనగర్ గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న హరితహారం మొక్కలకు మంగళవారం పక్కనే ఉన్న వెంచర్ నిర్వాహకుడు నిప్పు పెట్టారు. వెంచర్‌లోని ముందు భాగం కనబడేందుకు నిప్పుపెట్టినట్లు తెలిసింది. దీంతో మొక్కలు కాలిపోయాయి.

మృతదేహంతో ఎమ్మెల్యే ఇంటి ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న బాధిత గల్ఫ్ జేఏసీ నాయకులు

వేములవాడ: కథలాపూర్ మండలం గంభీర్‌పూర్‌కు చెందిన వెంకటేశ్ గల్ఫ్‌కు చేరుకున్న 14 రోజుల్లోనే మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని, గల్ఫ్ బాధితులకు ప్రభుత్వం ఇస్తామన్న రూ.500 కోట్లు ఇవ్వలేదని పేర్కొంటూ మంగళవారం గల్ఫ్ జేఏసీ నాయకులు జి.రవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఇంటి ఎదుట శవపేటికతో ధర్నా, నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న టౌన్ సీఐ వెంకటేశ్, ఎస్సై రఫీక్ తమ బృందాలతో చేరుకుని నిరసనకారులను ఠాణాకు తరలించారు. వెంకటేశ్ మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా గంభీర్‌పూర్‌కు తరలించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

అధ్వానంగా ఆలయ వసతి గదులు



ఆలయ వసతి గదులను పరిశీలిస్తున్న చొక్కాల రాము

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ వసతి గదులు అధ్వానంగా ఉన్నాయని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము అన్నారు. మంగళవారం ఆలయానికి చెందిన పార్వతీపురం వసతిగదులను పరిశీలించారు. రాజన్నను దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు సరైన వసతిగదులు లేవని, పోస్టుమార్టం గదులను తలపించేలా బెడ్స్ ఉన్నాయని తెలిపారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్న రాజన్న ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. తాగునీటి సౌకర్యం, పార్కింగ్, టాయిలెట్స్ సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట కుమ్మరి అనిల్, జింక ఎల్లయ్య, చొక్కాల ప్రశాంత్ తదితరులున్నారు.

చిన్నారిని చిదిమేసిన నిర్లక్ష్యం

- స్కూల్ వ్యాన్ కిందపడి బాలిక దుర్మరణం



హాఫియ మృతదేహం

రాయికల్(జగిత్యాల): అసలే బడి బస్సు.. ఆపై ఆటాపాటల్లో మునిగితేలే చిన్నారులు.. ఎలాంటి ప్రమాదం ముంచుకు వస్తుందనే పరిజ్ఞానమే తెలియని బుడతలు.. వాహనం నడిపే సమయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన డ్రైవర్.. విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించాడు. అప్పటిదాకా తన అక్క రాకకోసం ఎంతో సంతోషంగా ఉన్న ఆ చిన్నారిని చిదిమేశాడు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగరావుపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం స్కూల్‌వ్యాన్ కిందపడి హాఫియ(4) మృతి చెందడం కలచివేసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగరావుపేట గ్రామానికి చెందిన నిజామొద్దీన్–సైనా దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు హల్ఫియ(8) అల్లీపూర్‌లోని శ్రీవాణి పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. రెండో కూతురు హాఫియ(4) సింగరావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తోంది. చాలారోజుల తర్వాత మంగళవారం ఉదయం తండ్రి నిజామొద్దీన్ తన చిన్నకూతురు హాఫియను అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లి దించివచ్చాడు. ఆ తర్వాత వీఆర్‌ఏ ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లాడు. సాయంత్రం తల్లి వెళ్లి ఆ పాపను ఇంటికి తీసుకొచ్చింది. అంతలోనే పెద్దకూతురును తీసుకెళ్లిన స్కూల్ వ్యాన్ ఇంటి సమీపంలోకి వచ్చి ఆగింది. ఆమెను తీసుకెళ్లేందుకు వ్యాన్ వద్దకు వెళ్లింది తల్లి. తల్లి వెనకాలే వెళ్లిన చిన్నారి హాఫియ వ్యాన్‌కిందకు పోయింది. పెద్దకూతురును వ్యాన్‌లోంచి కిందకు దించి ఇంటికి వెళ్తుండగా.. వ్యాన్ ముందుకు కదిలింది.. అంతే.. హాఫియ ఆ వ్యాన్ వెనుక టైర్ కిందపడి నలిగిపోయింది. ఇంట్లో ఆడుకుంటున్న పాప వ్యాన్‌కిందకు ఎలావచ్చింది, ఎలా చనిపోయిందో తెలియని ఆ తల్లి హృదయం తల్లడిల్లిన తీరుచూసి గ్రామస్తులు కంటతడి పెట్టారు. చాలారోజుల తర్వాత తన కూతురును బైక్‌పై అంగన్‌వాడీ కేంద్రానికి తీసుకెళ్లానని, సాయంత్రమే ఇలా శవంగా చూస్తానని ఊహించలేకపోయానని తండ్రి బోరున విలపించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రసాభాసగా సెస్ ప్రతినిధుల ఎన్నిక



వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట గ్రామస్థాయి సెస్ ప్రతినిధుల ఎన్నిక మంగళవారం రసాభాసగా మారింది. సెస్ గ్రామస్థాయిలో ప్రతినిధులకు జరుగుతున్న ఎన్నికలో 13 మంది తమ నామినేషన్లు వేశారు. తొమ్మిది మంది నామినేషన్లను విత్‌డ్రా చేసుకోగా.. పారిపెల్లి రామిరెడ్డి, మేగి నర్సయ్య, నేవూరి పద్మారెడ్డి, బావికాడి రాజయ్యలు బరిలో నిలిచారు. వీరిలో ఇద్దరిని ఏకగ్రీవంగా ఎన్నుకుందామని సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి సూచించగా అక్కడ ఉన్న కొందరు గ్రామస్తులు ఏకగ్రీవానికి నిరాకరించారు. దీంతో ఎన్నికల అధికారి ఓటింగ్ విధానం అమలు చేసి ఓటర్లు మొదటి అభ్యర్థి రామిరెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరగా.. అక్కడే ఉన్న 75 శాతం చేతులెత్తి మద్దతు తెలిపారు. దీనికి ఎంపీటీసీ పందిర్ల నాగరాణి భర్త పర్శరామ్‌గౌడ్ ఒప్పుకోక ఎన్నికల అధికారి తిరుపతితో వాగ్వాదానికి దిగాడు. తమకు ఈ ఎన్నికల గురించి సమాచారం లేదని, రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో బీజేపీ నాయకులు ఎంపీటీసీ భర్త ఆరోపణలపై స్పందించారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో సమాచారం అందుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువురిని శాంతింపజేశారు. పోలీసుల సూచన మేరకు ఎన్నికల అధికారి తిరుపతి ఎన్నికను వాయిదా వేశారు. ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొనేందుకు వచ్చిన గ్రామస్తులు నిరాశతో వెనుదిరిగారు.

సామరస్యంగా సమస్య పరిష్కరించుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

చందుర్తి(వేములవాడ): ఏదైన సమస్య వస్తే వివాదాలు, గొడవలకు పోకుండా శాంతియుతంగా, సామరస్యంగా పరిష్కరించుకోవాలని చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్ అన్నారు. చందుర్తి శివారు అటవీ ప్రాంతంలోని గండి మైసమ్మ గుడికి నిర్మిస్తున్న ప్రహరీని సోమవారం కూల్చేయడంతో మండలంలోని రామన్నపేట, మల్యాల, చందుర్తి గ్రామాల ప్రజలు మంగళవారం చందుర్తిలోని రైతు వేదికలో సమావేశమయ్యారు. మైసమ్మ గుడి నిర్మాణానికి తీర్మాణం చేసుకొని అటవీ ప్రాంతానికి వెళ్తున్నట్లు సమాచారంతో చందుర్తి పోలీసులు అప్రమత్తమై వారిని అడ్డుకునేందుకు భద్రత చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతంలో గుడి నిర్మాణానికి అనుమతుల కోసం అటవీ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుందామని సీఐ సర్దిచెప్పారు. అధికార పార్టీ నాయకులు సైతం ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మహాశివరాత్రి తర్వాత అటవీ శాఖ అధికారులను సంప్రదించి నిర్ణయం తీసుకుందామని ఏకాభిప్రాయానికి వచ్చారు. దీంతో గ్రామస్తులంతా వెనక్కి తగ్గి వెనుదిరిగారు.